పెన్షన్..పరేషాన్!

- పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు
- చంద్రబాబు నిర్వాకంతో పునరావృతమైన నాటి పరిస్థితులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు
- తొలిరోజు నగరంలో అరకొరమందికే పెన్షన్ల పంపిణీ

కర్నూలు (టౌన్): గత 58 నెలలుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే ఠంఛన్‌గా పింఛన్ అందుకునే అవ్వాతాతలకు కష్టాలు మొదలయ్యాయి. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వాకంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఆ బాధ్యతల నుంచి తప్పించింది.దీంతో ఇంటి వద్ద పింఛన్ పంపిణీ నిలిచిపోవడంతో వృద్ధులు, వితంతువులు, చేనేత, డప్పు, చర్మ కళాకారులు, తదితర పింఛన్లు పొందే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి వార్డు/గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేస్తామని ప్రకటించడంతో వారంతా మండుటెండలో సచివాలయాలకు వెళ్లి పడిగాపులు కాశారు. నగరంలోని 133 వార్డు సచివాలయాల పరిధిలో 34,232 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. ప్రతినెలా ఎలాంటి ఇబ్బందిలేకుండా పింఛన్లు అందేవని, చంద్రబాబు నిర్వాకంతో ఇప్పుడు అవస్థలు పడుతున్నామని వారు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.




పాతబస్టాండ్‌లో రెండో అంతస్తులోని 28, 131 సచివాలయాలకు అవస్థలు పడుతూ మెట్లు ఎక్కుతున్న పెన్షన్‌దారులు, పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అరకొరగా పెన్షన్ల పంపిణీ

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కుట్రతో పెన్షన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఎప్పుడూ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకు వచ్చే పెన్షన్‌ను ఆయన అడ్డుకోవడంతో పెన్షన్‌దారులు అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు వెళ్లారు. నడవలేని కొందరు వృద్ధులు, దివ్యాంగులు ఆటోల్లో వచ్చారు. అయితే, బుధవారం అనేక సచివాలయాల కార్యదర్శుల అకౌంట్లలో నగదు జమ కాలేదు. జమ అయిన చోట అరకొరగా పంపిణీ చేశారు. దీంతో ఉదయాన్నే అవస్థలు పడుతూ సచివాలయాలకు వచ్చిన పెన్షనర్లు తీవ్ర నిరాశకు గురయ్యారు.

రెండు రోజుల్లో 100శాతం పెన్షన్ పంపిణీ చేస్తాం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయాల్లోనే కార్యదర్శుల ద్వారా పెన్షన్ పంపిణీ చేస్తున్నాం. బుధవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. పూర్తి స్థాయిలో గురు వారం నుంచి ప్రారంభిస్తాం. సచివాలయాలకు వచ్చే పెన్షన్ దారులకు అక్కడే ఇస్తాం. వారికి ఇబ్బందులు లేకుండా షామియానాలు ఏర్పాటు చేస్తాం. మంచినీటి సౌకర్యం కల్పిస్తాం. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సచివాలయానికి రాని పెన్షనర్లకు, బయటకు రాలేని వారికి, కిడ్నీ బాధిత పెన్షనర్లకు సచివాలయ ఉద్యోగులే వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారు. ఈనెల 6 వ తేదీ లోపు నగరంలో 100 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేస్తాం.

– నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



పింఛన్ కోసం మండుటెండలో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు

రావాలంటే ఇబ్బందిగా ఉంది



ఎప్పుడూ మాకు ప్రతి నెల 1 తేది ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే వాళ్లు. దీంతో మాకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఇప్పుడు పెన్షన్ అందక మూడు రోజులు అవుతుంది. వలంటీర్లు లేరని.. మీరే సచివాలయాలకు రావాలని చెప్పారు. ఈ వయస్సులో నడుచుకుంటూ సచివాలయానికి రావాలంటే ఇబ్బందవుతుంది. ఆఫీసు మెట్లు ఎక్కలేని పరిస్థితి. ఇంటి వద్దకు పెన్షన్ రాకుండా అడ్డుకోవడం మంచిది కాదు.

– గుల్బర్ బీ, వితంతు పెన్షన్, 25 వ సచివాలయం,10 వ వార్డు

మాపై ఎందుకింత కక్ష ?



మాపై ఎందుకింత కక్ష. వితంతువులం. రోజూ చిన్నా చితక పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. గతంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. జగన్ ప్రభుత్వంలో ఇంటికి వచ్చి పెన్షన్ మంజూరు చేశారు. ఐదేళ్లుగా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్ డబ్బు ఇస్తున్నారు. ఇప్పుడు వారిని పక్కన పెట్టారు. దీని వల్ల మాలాంటి వారికి చాలా కష్టమవుతుంది. సమయానికి పింఛన్ అందకపోతే మా అవసరాలు ఎలా తీర్చుకుంటాం.

– మాణిక్యమ్మ, వితంతు పెన్షన్, బుధవారపేట

ముసలోళ్లను తిప్పడం సరికాదు



ఈ వయస్సులో మాలాంటి వారిని సచివాలయాల చుట్టూ తిప్పడం సరికాదు. ఒకరి మీద ఆధార పడకుండా వైఎస్ జగన్ పెన్షన్ ఇస్తున్నారు. అది కూడా ఇంటికి తెచ్చి ఇస్తున్నాడు. 5 సంవత్సరాల నుంచి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే తీసుకున్నాం. ఎన్నికల కోడ్ పేరుతో ఇప్పుడు ఇబ్బందులు పెడుతున్నారు. ఎండలో బయటకు రావాలంటే భయంగా ఉంది. అవస్థలు పడి వస్తే మళ్లీ సాయంత్రం రావాలని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు.

– రహిమాబీ, 28 వ సచివాలయం, మున్సిఫ్ కోర్టు వద్ద

క్లుప్తంగా

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు



సావిత్రిబాయిని అభినందిస్తున్న హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న సావిత్రిబాయిని బుధవారం పలువురు హెడ్ నర్సులు, స్టాఫ్‌నర్సులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగంలో నిబద్ధత, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. రోగులకు నిస్వార్థంగా సేవలు అందిస్తూ వృత్తిలో మరింత రాణించాలని చెప్పారు. కాగా సావిత్రిబాయి కర్నూలు, పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుదీర్ఘ కాలం 26 ఏళ్ల పనిచేశారు. 1998లో ఆమె స్టాఫ్‌నర్సుగా, 2010లో హెడ్‌నర్సుగా, 2023లో గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ ఉద్యోగులు మానవతా దృక్పథంతో మజ్జిగ, చల్లని నీటితో చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమని ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. బుధవారం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్ దగ్గర పాదచారుల కోసం మజ్జిగ సెంటర్‌ను ఎస్‌ఈ ప్రారంభించారు. విద్యుత్ ఉద్యోగులు చందాలు వేసుకొని మే నెల చివరి వరకు చలి వేంద్రాన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఓబులేసు, భాస్కర్, ఎస్ఏఓ రాఘవులు, జేఏఓ రామరాజు, పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా

కర్నూలు(సెంట్రల్): ఏపీసీసీ అధికార ప్రతి నిధి అనంత కరుణాకరబాబు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పీసీసీఅధ్యక్షురాలు షర్మిళకు తన రాజీనామా లేఖను పంపారు.తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.అయితే పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఏకపక్ష నిర్ణయంతోనే తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, కోడుమూరు టిక్కెట్‌ను ఆశించిన తనతోపాటు దామోదరం రాధాకృష్ణలకు కాకుండా ఇటీవల పార్టీలో చేరిన పరిగెల మురళీకృష్ణకు కేటాయించడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీలో దళితులను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

బీజేపీకి మూల్యం తప్పదు

కర్నూలు(సెంట్రల్) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా కుట్రలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన మూల్యం తప్పదని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు హెచ్చరించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాంగ్రెస్ పార్టీ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అకౌంట్లపై ఈడీ, ఐటీ శాఖలతో ఫ్రీజ్ చేయించారన్నారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురళీకృష్ణలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోడుమూరు అభ్యర్థి మురళీ కృష్ణ, నాయకులు ఉండవెల్లి వెంకటన్న, రామస్వామి, అనంతరత్నం, బతుకన్న,కె.సత్యనారాయణగుప్తా,రాజ రస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కర్నూలు:డోన్ జాతీయ రహదారిపై హ్యాంగౌట్ హోటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిడ్డయ్య (35) కోలుకోలేక బుధవారం మృతిచెందారు. కల్లూరు మండలం పద్మావతి నగర్‌లో నివాసముంటున్న కురువ బాలన్న గారి ఆదినారాయణతో కలసి గిడ్డయ్య మంగళవారం వెంగన్నబావి సమీపంలోని వెంకటేశ్వర నగర్‌లో ఉన్న శ్రీసాయి మారుతి ట్రాన్స్‌పోర్ట్ వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడ్డ గిడ్డయ్య చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. ఈఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కాలేజీలో ఘనంగా ఫేర్‌వెల్



జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి

కర్నూలు సిటీ : ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ (డాక్టర్స్ కాలనీ)లో బుధవారం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తును తీర్చిదిద్దుకునే దశలో ఉన్నటువంటి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదువుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్స్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం, హోర్డింగ్‌లకు అనుమతులు తప్పనిసరి

- పాణ్యం నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి/జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్) : ఎన్నికల ప్రచారం, వాడే వాహనాలకు తప్పనిసరిగా జిల్లా ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాల్సిందేనని పాణ్యం ఆర్ఓ,జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీలకు స్పష్టం చేశారు. అంతేకాక ప్రచారం కోసంవినియోగించే పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లకు కూడా అనుమతి తీసుకోవాలన్నారు. లేనిచో ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అనుమతులు పొందిన వాహనాల కంటే ప్రచారంలో వినియోగిస్తే వాటిని సీజ్ చేసి ఖర్చులను సంబంధిత అభ్యర్థుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించినెల రోజులకు ఒకేసారి అనుమతి తీసుకోవచ్చన్నారు.ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెత్ ఓటరు లిస్టుల తయారీలో బీఎల్‌ఓలు,బీఎల్‌ఏలు,పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకొని రూపొందించాలన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు,అనారోగ్యంతో బాధపడే వారికి హోం ఓటింగ్, అత్యవసర సర్వీసులలో పనిచేసే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలట్ సదుపాయంకల్పించినట్లు చెప్పారు.కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ఫణికుమార్, జమానుల్లా, నగరాజు,మునివేలు, వైఎస్ఆర్‌సీపీతరఫున సురేష్, టీడీపీ తరఫున చత్రపతిరెడ్డి, బీఎస్పీ నుంచి చిరంజీవి పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ పేరుతో పోలీసులు చితకబాదారు

- ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



ఎస్పీని కలసి మీడియాతో మాట్లాడుతున్న ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు 9వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ పుల్లమ్మ కుమారుడు నవీన్‌తో పాటు జొహరాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రత్నం, ఆయన కుమారుడు మధులను పోలీసులు మంగళవారం రాత్రి కౌన్సెలింగ్ పేరుతో తీసుకెళ్లి చితకబాదారు. ఎలాంటి నేర చరిత్ర లేనప్పటికీ నవీన్‌తో పాటు మరికొందరు పార్టీ కార్యకర్తలను ఫ్యాక్షన్ జోన్ పోలీసు అధికారి పోలీస్ శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి కొట్టి భయపెట్టారు. కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లిన వారంతా 1, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధికి చెందినవారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఎలాంటి నేర చరిత్ర లేనప్పటికీ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులను కౌన్సిలింగ్ కొరకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి దేయి చేసుకోవడం తప్పు అని కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఖండించారు. ఇలాంటి చర్యలు ఎంతవరకు సబబు అని బుధవారం ఎస్పీ కృష్ణకాంత్‌ను కలసి వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసుల వేధింపులు తగవని పేర్కొన్నారు.

ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఏఆర్‌టీ క్లినిక్స్, ఫెర్టిలిటీ కేంద్రాలు ఇకపై తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని అసిస్టెంట్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టి) క్లినిక్స్ అయిన శ్రీ అశ్విని హాస్పిటల్, అమృత హాస్పిటల్, సీఎస్ హాస్పిటల్‌లను తనిఖీ చేశారు. ఇవి ఇటీవల ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో జిల్లా స్థాయి తనిఖీ బృందం ఈ మేరకు వెళ్లి పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు పూర్తి చేసి సబ్మిట్ చేసిన తర్వాత ప్రింట్ తీసి ప్రతి పేజీలో సంతకం, సీల్ వేసి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం బ్యాంక్ డీడీ(ఏఆర్‌టీక్లినిక్ లెవెల్ 1కి రూ.50వేలు, ఏఆర్‌టీ క్లినిక్ లెవెల్–2కు రూ.2లక్షలు, ఏఆర్‌టీ బ్యాంక్‌కు రూ.50వేలు, సరోగసి క్లినిక్‌కు రూ.2లక్షలు)ను డిస్ట్రిక్ట్ అప్రాప్రియేట్ అథారిటీ(ఏఆర్‌టి అండ్ సరోగసి యాక్ట్) అండ్ డీఎంహెచ్‌వో, కర్నూలు పేరున దరఖాస్తుతో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. ఈ దరఖాస్తు జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ టీమ్ పరిశీలించిన తర్వాత జిల్లా స్థాయి కమిటీలో ఆమోదం తర్వాత అర్హత కలిగిన కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలక్ష్మి, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, డాక్టర్ బాలమద్దయ్య, ఏఆర్‌టి క్లినిక్ వైద్యనిపుణులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రావ్య, డెమో ఇన్‌చార్జి శ్రీనివాసులుశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక బి.తాండ్రపాడు గ్రామంలోని హెల్త్‌క్లినిక్‌లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి అక్కడి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని అర్హులైన గర్భిణులు, చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలని,ముఖ్యంగా ఎంఆర్–1, ఎంఆర్–2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏఎన్‌ఎం హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణీ వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం ఆయన గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. వేసవి ఉష్ణోగ్రతల రీత్యా డీహైడ్రేషన్‌కు గురికాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కసారి వడదెబ్బకు గురికావడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాంతకం అవుతుందని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి ఇవ్వాలని, ఒకవేళ తీవ్ర డీహైడ్రేషన్‌కు గురైన వారిని సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించి ఐవీ ఫ్లూయిడ్స్‌తో చికిత్స అందేటట్లు చూడాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ
- 14వ వార్డులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థన



14 వ వార్డులో కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఐఏఎస్ ఇంతియాజ్‌ను ఎన్నికల్లో ఓటేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక 14 వ వార్డు పరిధిలోని హబీబ్ ముబారక్‌నగర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఇంటింటికీ సంక్షేమం అందించిన ఘనత జగనన్నదే అన్నారు. గత ప్రభుత్వం ఉన్నవాళ్లకు ఊడిగం చేసిందని, పేదలను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. పేదల పక్షాన నిలిచిన జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఇంతియాజ్

నగరంలోని 8 వ వార్డు గడ్డ వీధిలోని సలాంఖాన్ షాదీఖానాలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పాల్గొన్నారు. ఆయన వెంట కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌ను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : వేసవికాలంలో నిర్వహించనున్న స్విమ్మింగ్‌పూల్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్‌ను స్విమ్మర్లు , శిక్షణ కోసం వచ్చే ఔత్సాహిక స్విమ్మర్ల కోసం ఆధునీకరించారు. దీనిని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ నటరాజారావు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కర్నూలు సిటీ: నగరానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జానకీరాంపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈయన మొదట కాలేశ్వరమ్మ అనే మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత విజయవాడకు చెందిన రాజ్యలక్ష్మిని, మరి కొన్నాళ్లకు నాగమణి అనే మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఇటీవల మొదటి భార్య తనకు తన భర్తతో ప్రమాదం ఉందని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జానకీరాం పైకేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుగుణమ్మ మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్) : నంద్యాల సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా పనిచేస్తున్న సుగుణమ్మ అనారోగ్యంతో మృతి చెందడం ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుపరిపాలనకు ఓటేయండి



35వ వార్డులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని

- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు మరోసారి ఓటేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన వల్ల ప్రతి గడపకు లబ్ధిచేకూరిందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చేస్తున్న అసత్యాలను, అబద్ధాలను నమ్మి మోసం పోవద్దని సూచించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని గతంలో ప్రచారం చేసిన టీడీపీ నాయకులు, ఇప్పుడు మా పథకాలతో పాటు మరిన్ని కొత్త పథకాలు అమలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అజెండా పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురితో పాటు నాయకులు పాల్గొన్నారు.



29వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాటసాని మాధవీలత

నాన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నాన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమార్తె మాధవీలత ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులోని గట్టయ్య నగర్, కస్తూరి నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ నవరత్నాల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడు మృతి

కర్నూలు(అర్బన్):శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు ఎం. అల్లూరి నర్సరాజు ఈ నెల 2వ తేదిన రాత్రి అనారోగ్యంతో మృతి చెందారని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడ నల్లా పేరయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిగ్నల్స్ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన నర్సరాజు స్థానిక ఫ్యాక్టరీలో పని చేస్తుండేవారన్నారు. ఆయన మృతి పట్ల సంఘం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తుందన్నారు.

వేధిస్తున్న ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: జిల్లాకు వచ్చిన పాఠశాల ప్రాంతీయ సంచాలకులు (ఆర్జేడీ) వై.రాఘవరెడ్డి బుధవారం డైట్ కాలేజీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో కర్నూలు అర్బన్ ఎంఈఓ, క్రిష్ణగిరి, వెల్దుర్తి ఎంఈఓలతో పాటు కోడుమూరు ఎంఈఓలపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. వివిధ రూపాల్లో ఉపాధ్యాయులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతేడాది సప్లమెంటరీ పరీక్షల రెమ్యూనరేషన్ ఇప్పించాలన్నారు. అలాగే గోనెగండ్ల మండలం పుట్టపాశం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న నొస్సం రాజశేఖర్ శర్మ ఆత్మహత్యపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రవికుమార్, గోకారి, రంగన్న, ఇస్మాయిల్, హెచ్‌ఎంల సంఘం నాయకులు శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.